# పంట సాగులో మెళకువలు పాటించాలి

- ఎంఎవో అసం రవి
- బావపూర్ తండాలో నూనె గింజల పంట సాగుపై రైతులకు అవగాహన

బావపూర్ తండాలో నూనెగింజల పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఖానాపూర్ రూరల్, డిసెంబర్ 8: రైతులు పంటల సాగు విధానంలో ఎప్పటికప్పుడు మెళకువలు నేర్చుకోవాలని ఎంఎవో అసం రవి పేర్కొన్నారు. మండలంలోని (ఆర్) బావపూర్ తండాలో నూనె గింజల పంట సాగుపై అవగాహన కల్పించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నూనెగింజల పరిశోధన కేంద్రం సహకారంతో ఖానాపూర్ మండల వ్యవసాయ శాఖ, సేవా స్ఫూర్తి పౌండేషన్ ఆధ్వర్యంలో నూనె గింజల పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నూనె గింజల పంటలపై దృష్టిసారిస్తే ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకొని నూనె గింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, అడస్కా కంపెనీ మేనేజర్ కృష్ణారావు, సేల్స్ మేనేజర్ చంద్రమోహన్, సర్పంచ్ వినేశ్, రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కడెం/దస్తురాబాద్, డిసెంబర్ 8: దస్తురాబాద్ మండల కేంద్రానికి చెందిన యువకుడు నాగచైతన్య ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై ఎడమ కాలు పూర్తిగా కోల్పోగా, నిర్మల్ లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కడెం మండలంలోని మానవసేవే మాధవసేవా గ్రూప్ ఫౌండర్ శెట్‌పెల్లి మహేందర్ వాట్సాప్ గ్రూప్ ద్వారా పోగు చేసిన రూ.5 వేలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదానికి గురైన నాగచైతన్య చికిత్స కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వారి కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందన్నారు. అయితే తమ పౌండేషన్ ద్వారా వారికి కొంత ఆర్థికసాయం అందజేశామని, అలాగే నాగచైతన్య కుటుంబానికి దాతలు ముందుకొచ్చి మరింత అండగా నిలవాలని వారు కోరారు. నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ, వారి కష్టాల్లో కొం త భాగమైన పంచుకోవాలనే తమ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు అల్లంల పవన్, శివ, పవన్, సాయి, రాకేశ్, లక్ష్మన్ ఉన్నారు.

## సద్గురువులు ఉపాధ్యాయులు

దస్తురాబాద్,డిసెంబర్ 8 : సద్గురువులు ఉపాధ్యాయులు అని ఎంపీపీ సింగరి కిషన్ అన్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం శేఖర్ రెడ్డి, రాధిక, మహేశ్, వెన్నం అంజయ్య బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధులు,పాఠశాల బృందం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గత 12,8 సంవత్సరాలుగా పాఠశాలకు చేసిన సేవను,కృషిని ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన, సహకరించిన ప్రతి ఒక్కరికి బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి హెచ్ఎం శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు వస్త్రాలను అందించి,శాలువాలతో వారు సన్మానించారు. పాఠశాలకు వారి గుర్తుగా బ్యాండ్‌ను విరాళంగా అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం శంకర్, మాజీ సర్పంచ్ సిర్ప సంతోశ్, ప్రధాన ఉపాధ్యాయులు వామన్ రావు, గంగాధర్, భూపతి రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బ్రహ్మచారి, విశ్రాంత ఉపాధ్యాయుడు అడ్డగూరి ప్రభాకర్, పాఠశాల బృందం, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ రుణాలను వినియోగించుకోవాలి

- టీజీబీ ఆర్ఎం రామారావు
- 100 కోట్ల రుణ లక్ష్యం సాధించిన టీజీబీ

కుంటాల, డిసెంబర్, 8 : ఖాతాదారులు బ్యాంకు రుణాలను సద్వినియోగించుకోవాలని టీజీబీ రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.100 కోట్ల రుణాలు, పొదుపుల లక్ష్యం చేరిన సందర్భంగా శుక్రవారం ఆర్ఎం బ్రాంచి సిబ్బందిని అభినందించారు. ఇటీవల అం బకంటి గ్రామానికి హంపోలి శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తరపున రూ.20 లక్షలు క్లెయిమ్ చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీబీ బ్రాంచ్ మేనేజర్ సంతోశ్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ అబ్రహం, ఆడిటర్ గంగారాం పాల్గొన్నారు.

బీమా చెక్కును లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు అందజేస్తున్న టీజీబీ ఆర్ఎం రామారావు

విట్టాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

## మొక్కలను సంరక్షించాలి

కుంటాల, డిసెంబర్, 8 : నర్సరీలు, వివిధ కామన్ ఏరియాల్లో పెంచే మొక్కలను సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి మధుసూధన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని విట్టాపూర్‌లో పర్యటించి పల్లె ప్రగతి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. విట్టాపూర్ నర్సరీలో పెంచనున్న 13 వేల మొక్కలను ఆయన పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో నవీన్, సెక్రటరీలు కవిత, సారిక పాల్గొన్నారు.

## వైల్డ్‌లైఫ్‌పై అటవీశాఖ అధికారులకు శిక్షణ

కడెం, డిసెంబర్ 8: మండలంలోని ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని కల్పకుంటలో శుక్రవారం అటవీ సెక్షన్ అధికారులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్ దూలపల్లి శిక్షణ అకాడమీ నుంచి 40 మంది శిక్షణ సెక్షన్ అధికారులు కడెం మండలంలోని ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని కల్పకుంటకు శిక్షణ డైరెక్టర్ రామోహ్మన్ ఆధ్వర్యంలో చేరుకున్నారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శంకర్, డీఆర్వో ప్రకాశ్, సిబ్బంది, ప్రసాద్ శిక్షణ అధికారులకు చూపిస్తూ, అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. అయితే అటవీ ప్రాంతాల్లో వాచ్‌టవర్ల వల్ల ఎంతో మేలు కలుగుతుందని, ఎత్తైన ప్రాంతంలో వాచ్‌టవర్ నిర్మించడం వల్ల నిత్యం వన్య ప్రాణులను వీక్షించడంతో పాటు, అటవీ ప్రాంతంపై నిఘా వేయొచ్చనే విషయాలను తెలియజేశారు. అలాగే అటవీ ప్రాంతాల సంరక్షణ కోసం అధికారులు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రధానంగా బేస్‌క్యాంపు సిబ్బందితో కలిసి పని చేసే పలు అంశాల వివరాలను తెలియజేశారు. వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపదను కాపాడడం వంటి వాటితో పాటు, అటవీ సంపద ఉపయోగాలను వారికి తెలియజేశారు. వేసవిలో అటవీ ప్రాంతంలో అగ్గి రాజుకొని నష్టం వాటిల్లే ప్రమాదాలు ఉంటాయని, వాటికి తీసుకోవల్సిన చర్యలు, బేస్ క్యాంపు సిబ్బంది పనితీరు వంటి వాటి గురించి తెలియజేశారు. అనంతరం వీరికి వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపెల్లి కృష్ణ వైల్డ్‌లైఫ్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ అధికారులకు పలు సూచనలు చేశారు. అటవీ ప్రాధాన్యత, పక్షులు, వన్యప్రాణుల గురించి వివరించారు. అయితే గత కొంతకాలంగా వైల్డ్‌లైఫ్‌లో రాణిస్తూ, పక్షులు, అటవీ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణను సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శంకర్, డీఆర్వో ప్రకాశ్, సిబ్బంది ప్రసాద్ ఉన్నారు.

వైల్డ్‌లైఫ్‌పై అధికారులకు సూచనలు చేస్తున్న అధికారులు

అంగన్‌వాడీలో పిల్లలతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అషాఫక్ హైమద్

## పలు గ్రామాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

తానూర్, డిసెంబర్ 8 : మండలంలోని బెల్‌తరోడ, బొంద్రట్ గ్రామాలను మండల ప్రత్యేకాధికారి అషాఫక్ హైమద్ శుక్రవారం సందర్శించారు. బొంద్రట్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. బెల్‌తరోడ గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వీరి వెంట మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శులు జయశ్రీ, అశ్విని తదితరులు ఉన్నారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

భైంసా, డిసెంబర్, 8 : పట్టణంలోని భైంసా విలీన విద్యా కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దివ్యాంగులను అన్ని సంక్షేమ పథకాల్లో అర్హులుగా చేర్చి ఆదుకోవాలన్నారు. ఎవరైనా అవమానపరిస్తే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సూచించారు. ఇందులో మండల విద్యాధికారి సుభాశ్, ఐఈఆర్‌పీ సునీల్, ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్, నాయకులు మహేశ్ బాబు ఉన్నారు.

## ఎలుగుబంటి దాడిలో యువకుడికి తీవ్రగాయాలు

కడెం, డిసెంబర్ 8: మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మైసంపేట గ్రామానికి చెందిన ఆడ మహేందర్ అనే యువకుడిపై ఎలుగుబంటి దాడి చేయగా, ఈ దాడిలో మహేందర్‌కు తీవ్రగాయాలైనట్లు అటవీశాఖ అధికారులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మహేందర్ గొర్ల కాపరి, తన గొర్రెలను మేపేందుకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి గురువారం సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లేందుకు గొర్రెలను గుంపుగా చేర్చుతున్న సమయంలో మండలంలోని ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఉడుంపూర్ సెక్షన్‌లోని మైసంపేట బీట్ అటవీ ప్రాంతంలో నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా మహేందర్‌పై దాడికి పాల్పడింది. ఈ దాడిలో యువకుడి కుడి కన్నుతో పాటు, మొహం, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలైనట్లు వారు తెలిపారు. అయితే ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అటువైపు వెళ్తున్న పలువురు స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులతో పాటు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అధికారులు అటవీశాఖ వాహనంలో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించి, పరిస్థితి క్లిష్టంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శంకర్, డీఆర్వో ప్రకాశ్ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడెం, డిసెంబర్ 8: మండలంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని కడెం ఎస్‌పీడీసీఎల్ ఏఈ సుమన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున కడెం, బెల్లాల్, లింగాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన సూచించారు.

## ప్రతిభ కనబర్చిన పలువురికి పురస్కారాలు

పురస్కారాలతో కండక్టర్లు, డ్రైవర్లు

భైంసా, డిసెంబర్, 8: భైంసా ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్, డ్రైవర్లకు శుక్రవారం పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం అమృత మాట్లాడుతూ, ప్రతి ఒక్క డ్రైవర్, కండక్టర్ వీరిని స్ఫూర్తిగా తీసుకొని డిపోకు మరింత ఆదాయం తీసుకురావాలన్నారు. కండక్టర్‌లు గౌస్, గంగామణి, శ్రీనివాస్, రాములు, పతిభ కనబర్చిన డ్రైవర్లు శంకర్, రఫీఖోద్దిన్, హర్షద్, దేవురావు, ఖయ్యూం, శ్రీనివాస్, నర్సయ్య, ఖలీం, శ్రీరాములు, ఉత్తమ పెయింటర్‌లుగంగారాం, బాజీ రెడ్డి, రమణలకు పురస్కారాలు అందించారు.

## ఈ-కేవైసీ చేసుకోవాలి

భైంసా, డిసెంబర్, 8 : భైంసా పట్టణంతో పాటు పలువురు ఉజ్వల గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేసుకోవాలని కృపా గ్యాస్ మేనేజర్ అజయ్ పాఠక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గ్యాస్ బుక్, ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆయన సూచించారు.